సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు



ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ జగన్మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని చేపట్టిన ప్రతి పనీ విజయవంతం కావాలని కోరుకున్నారు.

ప్రతిరైతూ ఈ–క్రాప్ చేయించుకోవాలి



ప్యాదిండిలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్

చెన్నేకొత్తపల్లి: పంటసాగు చేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో వివరాలు నమోదు చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్ సూచించారు. బుధవారం మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్యాదిండి గ్రామంలో 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' కార్యక్రమంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్ మాట్లాడుతూ... ఈ–క్రాప్ చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించబోవన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ తగ్గించిందని, దీని వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. పంటలసాగులో యూరియాకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఏడీ లక్ష్మానాయక్, పలువురు రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

తండ్రి పోషణ బాధ్యత పిల్లలదే

- కుమార్తెలకూ ఈ నిబంధన వర్తిస్తుంది
- ఇద్దరు బిడ్డలు నెలకు రూ.10 వేలు తండ్రికి ఇవ్వాలని ఆర్డీఓ తీర్పు



వృద్ధుడికి తీర్పు ఉత్తర్వులు అందిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: పెంచి పెద్దచేసి, చదివించి, వివాహాలు చేసిన తండ్రి వృద్ధాప్యంలో ఉండగా పట్టించుకోని ఇద్దరు కుమార్తెలకు ధర్మవరం ఆర్డీఓ మహేష్ గుణపాఠంలాంటి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని సాయినగర్‌లో నివసిస్తున్న చారుగుండ్ల అహోబులప్ప(62)కు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఇద్దరికీ విద్యాబుద్ధులు నేర్పించి వివాహాలు చేశాడు. కొన్నేళ్ల క్రితం భార్య చనిపోవడంతో అహోబులప్పను పట్టించుకునే వారు కరువయ్యారు. వృద్ధాప్యంతో ఏ పనీ చేసుకోలేని పరిస్థితుల్లో కుమార్తెల వైపు ఆశగా చూసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆయన తనకు న్యాయం చేయాలని ధర్మవరం ఆర్డీఓను కోరారు. ఈ కేసును మానవత్వంతో విచారించిన ఆర్డీఓ మహేష్... వృద్ధుడైన అహోబులప్ప ఆర్థిక, వైద్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇద్దరు కుమార్తెలు నెలకు రూ.10 వేలు (ఒక్కో కుమార్తె రూ.5 వేల చొప్పున) తండ్రి జీవనోపాధి, వైద్య ఖర్చుల కోసం చెల్లించాలని తీర్పునిస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కాపీని అహోబులప్పకు అందించారు. వయోవృద్ధులు ఎవరైనా సరే ఏదైనా సమస్య ఎదుర్కొంటుంటే తనను సంప్రదించాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత కుమారులతో పాటూ కుమార్తెలకూ ఉంటుందని ఆర్డీఓ స్పష్టం చేశారు.

'పురం' వాసికి అంతర్జాతీయ ఫిడే రేటింగ్



భవ్య సహస్ర

హిందూపురం టౌన్: గత నెల 21న బెంగళూరు వేదికగా జరిగిన నాల్గవ చెక్ అండ్ మేట్ ఆల్ ఇండియా ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నీలో హిందూపురానికి చెందిన విద్యార్థిని భవ్య సహస్ర ఉత్తమ ప్రతిభతో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ 1,427ను దక్కించుకుంది. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి ఈ రేటింగ్ ఉపయోగపడుతుందని కోచ్ ఆరీఫ్‌వుల్లా తెలిపారు. ప్రతిభ చాటిన భ్య సహస్రను ఆయన అభినందించారు. అంతర్జాతీయ ఉమెన్ గ్రాండ్ మాస్టర్ కావడమే తన లక్ష్యమని భవ్య సహస్ర తెలిపారు.



మహిషాసుర మర్దిని అలంకరణలో వాసవీ మాత



రత్నగిరిలో మహిషాసుర మర్దిని రూపంలో కొల్లాపురి మహాలక్ష్మీదేవి



దసరా సందర్భంగా విద్యుత్ వెలుగుల్లో బత్తలపల్లి కొల్లాపురి అమ్మవారి ఆలయం

విజయీభవ!

- నేడు విజయదశమి
- సంబరాలకు సిద్ధమైన ప్రజలు
- పల్లెల్లో కనిపిస్తున్న దసరా సందడి

పుట్టపర్తి టౌన్: జిల్లాలో శరన్నవరాత్రుల సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. దసరాతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా ప్రజలు తమ వాహనాలను పూలతో అందంగా అలకరించి పూజలు చేశారు. వివిధ పరిశ్రమలు, యంత్ర దుకాణాలు తదితర వాటిలోనూ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన అయుధపూజలో దుర్గామాత చిత్రపటానికి ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులతోపాటు పోలీస్ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు పూజలు చేశారు.

మార్కెట్లు కళకళ..

పండుగ కొనుగోళ్లతో బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్లు, దుస్తుల దుకాణాలు కిటకిటలాడాయి. పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు జనం తరలిరావడంతో హిందూపురం, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో సందడి నెలకొంది.

పల్లెకు పండుగ కళ..

చదువు, ఉద్యోగరీత్యా పట్టణాలు, నగరాల్లో స్థిరపడిన వారంతా దసరా కోసం స్వగ్రామాలకు రావడంతో పల్లెకు పండుగ కళ వచ్చింది. రెండు, మూడు రోజులుగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు కిటకిటలాడుతున్నాయి.

శిల్పారామంలో దసరా సంబరాలు..

దసరా పండుగను పురస్కరించుకుని గురువారం పుట్టపర్తి పట్టణ సమీపంలోని శిల్పారామంలో సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు దసరా సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏఓ ఖాదర్‌వలి తెలిపారు.



ఆయుధపూజలో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు



పండుగ కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న ధర్మవరం మార్కెట్

పన్ను పోటు తగ్గలేదు..!

- జిల్లాలో జీఎస్టీ 2.0 అమలు అంతంతే • అన్ని చోట్లా పాత ఎంఆర్‌పీపైనే విక్రయాలు • 'పాత స్టాక్' అంటూ వ్యాపారుల మెలిక • చోద్యం చూస్తున్న అధికారులు

▸ పుట్టపర్తిలోని ఓ మందుల దుకాణంలో ప్రసాద్ అనే వ్యక్తి 10 మాత్రలు కొనుగోలు చేశాడు. దానిపై రూ.325 ఎంఆర్‌పీ ఉంది. రాయితీ అంటూ దుకాణదారుడు రూ.305 తీసుకున్నాడు. బిల్లు కావాలని అడిగితే రూ.265కే ఇచ్చాడు. అదేమని అడిగితే జీఎస్టీ తగ్గించాను. ఇదిగో మిగతా డబ్బులు అని వాపసు ఇచ్చాడు. ఒక వేళ అతను బిల్లు అడగలేదంటే జీఎస్టీ తగ్గింపు ఉండేది కాదు.

▸ టైఫాయిడ్‌కు సంబంధించి 10 మాత్రలున్న ఒక షీట్‌పై ఎంఆర్‌పీ రూ.155 ఉంది. గోరంట్లలోని ఒక మందుల దుకాణంలో బూడిదిగడ్డపల్లికి చెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి సదరు మందులు కొనుగోలు చేస్తే కేవలం రూ.5 తగ్గించి రూ.150 తీసుకున్నారు. జీఎస్టీ తగ్గింది కదా అని ప్రశ్నిస్తే...మా దగ్గర ఇంతే రేటు తీసుకుంటే తీసుకోండి..లేదంటే లేదని చెప్పారని కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

▸ కదిరిలోని ఒక సూపర్ మార్కెట్‌లో టీచర్ విజయలక్ష్మి 5 లీటర్ల వంట నూనె క్యాన్ కొనుగోలు చేశారు. ఎంఆర్‌పీ రూ.1,182 ఉంది. మారిన జీఎస్టీ ప్రకారం కొత్తగా స్టిక్కర్ ఉండాలి కదా.. దీనిపై లేదే..అని ఆమె ప్రశ్నిస్తే.. ఇది పాత స్టాక్... ఇంకా కొత్త స్టాక్ రాలేదు. కావాలంటే మీకు 5 శాతం తగ్గింపు ఇస్తామని సేల్స్ గర్ల్ చెప్పింది. చేసేది లేక ఆమె 5 శాతం తగ్గింపుతోనే నూనె క్యాన్ తీసుకెళ్లారు.

...ఇలా జిల్లా వ్యాప్తంగా వినియోగదారులు మోసపోతున్నారు. జీఎస్టీ 2.0 అమలు కాకపోవడంతో దుకాణదారు చెప్పిన ధరకు సరుకులు తీసుకువెళ్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాలతో పాటు ప్రతి మండలంలోనూ ఇదే తంతు నడుస్తోంది.



పాత ధరలే వసూలు చేస్తున్నారా..
1915
టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి

కదిరి: ప్రజలపై పన్నుల భారం తగ్గించి కొనుగోలు శక్తిని పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు తీసుకొచ్చింది. గత నెల 22 నుంచే కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇంత వరకూ బాగానే ఉన్నా..ఆ ఫలాలు సామాన్యులకు ఎక్కడా అందడం లేదు. కార్లు, ద్విచక్ర వాహనాల విక్రయాలపై తగ్గించిన జీఎస్టీ పక్కాగా అమలు చేస్తుండగా... పేద, మధ్య తరగతి ప్రజలు వినియోగించే నిత్యావసరాలు, ఇతర వినియోగ వస్తువుల విషయంలో జీఎస్టీ తగ్గింపు ధరలు ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలోని చాలా మంది వ్యాపారులు 'పాత స్టాక్' అంటూ ఎప్పటిలాగానే జీఎస్టీ వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజూ నిత్యవసర వస్తువుల వ్యాపారం రూ.20 కోట్ల వరకూ జరుగుతోంది. ఈ దసరా సీజన్‌లో ఇంకా ఎక్కువే జరిగి ఉంటుంది. 'సూపర్ సేవింగ్స్' మేరకు ప్రజలకు సరుకుల బిల్లు బాగా తగ్గి ఉండాలి. కానీ ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఇక జిల్లాలో 2 వేల వరకు మందుల దుకాణాలుండగా, వీటి ద్వారా రోజూ రూ.3 కోట్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన వినియోగదారులకు బాగా మేలు జరగాలి. కానీ తగ్గింపు ధరలు ఇంకా జిల్లాలో అమలుకాకపోవడంతో జనానికి 'పన్ను' పోటు తప్పడం లేదు.

ఇప్పుడు రెండే శ్లాబులు..

వస్తువులు, పరికరాలు, సామగ్రిపై ఇంతకు మునుపు నాలుగు రకాల శ్లాబులు ఉండేవి. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా 12, 28 శాతం శ్లాబులు ఎత్తేశారు. ప్రస్తుతం 5, 18 శాతం శ్లాబులు మాత్రమే అమలులో ఉన్నాయి. నిత్యవసర వస్తువులపై మొన్నటి వరకూ 18 శాతం జీఎస్టీ ఉండేది. తాజా మార్పులతో అది 5 శాతానికి పరిమితం కావాలి. కానీ ఈ తగ్గింపు ధరలు ఇంకా చాలా చోట్ల అమలు కావడం లేదు.

కానరాని జీఎస్టీ తగ్గింపు బోర్డులు..

ప్రతి దుకాణం ముందు జీఎస్టీ తగ్గింపునకు సంబంధించి బోర్డులు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ జిల్లాలో ఇవి చాలా అరుదుగా కనబడుతున్నాయి. కొన్ని చోట్ల చిన్న స్టిక్కర్ అతికించారు. ప్రధానంగా మందుల(ఔషదాలు)పై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించారు. క్యాన్సర్, ఇతర వ్యాధుల చికిత్సలో వినియోగించే మందులపై పన్ను పూర్తిగా తొలగించారు. కానీ ఎక్కడా ఆ మేరకు మందులు విక్రయించడం లేదు. వస్తు సేవల పన్ను పూర్తి తగ్గింపు ప్రయోజనాలు వినియోగదారులకు అందడం లేదు. ప్రశ్నించిన వారికి మాత్రం అరకొరగా తగ్గించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. సెప్టెంబర్ 22వ తేదీ తర్వాత తయారైన వస్తువులకు మాత్రమే జీఎస్టీ తగ్గింపు ధరలు వర్తిస్తాయని కొందరు వ్యాపారులు తెగేసి చెబుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

'సూపర్ సేవింగ్స్' పేరుతో జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సహాయ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్ర స్థాయిలో జీఎస్టీ తగ్గింపు ఫలాలు వినియోగదారులకు పూర్తి స్థాయిలో అందడం లేదు.

పన్నులు తగ్గినా పాత ధరలే



జీఎస్టీ తగ్గించామని కేంద్ర ప్రభుత్వం ఊదరగొడుతోంది. కానీ జిల్లాలో ధరలు తగ్గింది లేదు. ఎక్కడజూసినా పాత రేట్లకే అమ్ముతున్నారు. గట్టిగా అడిగితే నీకు ఇష్టమైతే కొనుక్కో.. లేదంటే వెళ్లిపో. పెద్ద రూల్ మాట్లాడుతున్నావు.. అని కోప్పడుతున్నారు. – మురళీకృష్ణ, ఓడీ చెరువు

ఎవరికి లాభం?



జీఎస్టీ తగ్గింపు మంచిదే. సామాన్య ప్రజలకు ఈ ఫలాలు అందితే సంతోషమే. కానీ ఎక్కడా ఆ ప్రభావం కనబడలేదు. టూత్‌పేస్టులు, బ్రష్‌లు, పౌడర్లు, సైకిళ్లు, వ్యవసాయ పరికరాలు, మందులు వంటివి 5 శాతం పన్ను పరిధిలోకి తెచ్చారు. కొన్ని రకాల మందులపై జీఎస్టీ పూర్తిగా లేకుండా చేశారు. కానీ ఈ తగ్గింపు ధరలు జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు.

– రామమోహన్‌రెడ్డి, అడ్వకేట్, కదిరి

ఎన్‌ఏపీఏ అథారిటీ ఏదీ..?

వ్యాపార సంస్థలు, వ్యాపారులు పన్నుల్లో తేడాలను అక్రమంగా సొమ్ము చేసుకోకుండా జీఎస్టీ కౌన్సిల్ పరిధిలో 'నేషనల్ యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీ(ఎన్‌ఏపీఏ)పని చేస్తుంది. ఈ సంస్థ నిబంధనలు ఉల్లంఘించిన వారికి అవసరమైతే జరిమానాలు విధిస్తుంది. కానీ ఆ అథారిటీ ప్రభావం జిల్లాలో ఎక్కడా కన్పించడం లేదని వినియోగదారులు అంటున్నారు. ధరలు తగ్గించని వ్యాపారులపై ఫిర్యాదు కోసం సరైన వేదిక కూడా లేదని వాపోతున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రతి వస్తువుపై పాత, కొత్త ధరలు స్పష్టంగా కనిపించేలా ముద్రించి విక్రయించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

జీఎస్టీ సంస్కరణ ఫలాలు అందరికీ అందాలి

- కలెక్టర్ శ్యాం ప్రసాద్
- బుక్కపట్నంలో పలు షాపుల తనిఖీ



జీఎస్టీ తగ్గింపు గురించి వృద్ధులకు వివరిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి అర్బన్: జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలన్న ఉద్దేశంతోనే 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన బుక్కపట్నం తేరు బజార్‌లోని పలు షాపులను సందర్శించారు. పలువురు స్థానికులకు జీఎస్టీ తగ్గింపు..తద్వారా వస్తువుల ధరల్లో వ్యత్యాసం గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జీఎస్టీలో స్లాబులు తగ్గించినందున ప్రజలు నిత్యం ఉపయోగించే టూత్ పేస్ట్ నుంచి ఏసీ వరకూ రైతులు వినియోగించే ట్రాక్టర్, యువత కొనుగోలు చేసే ద్విచక్ర వాహనాల వరకూ అన్ని రకాల వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. దీర్ఘ కాలిక వ్యాధులకు ఉపయోగించే ఔషధాలను జీఎస్టీ నుంచి మినహాయించారన్నారు. వీటిని ప్రజలకు తెలియజేసి జీఎస్టీ లబ్ధిపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం జీఎస్టీ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి రామునాయక్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జబ్బీర్ బాషా పాల్గొన్నారు.

చెరువుల్లో నీరు శాశ్వతంగా నిలిచేలా చర్యలు

ప్రశాంతి నిలయం: ఏడాదిలోపు జిల్లాలోని అన్ని చెరువులు, నీటి ట్యాంకుల్లోని నీరు శాశ్వతంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ట్యాంకుల్లో నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం పాండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో నీటి సంరక్షణ సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో చిన్న నీటి పారుదల శాఖ ఈఈ గురుమూర్తి, డీఈ గంగాద్రి, ఏఈ షబానా, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇన్‌చార్జ్ పీడీ శ్రీలక్ష్మి, హంద్రీనీవా సుజల స్రవంతి ఎస్‌ఈ రాజా స్వరూప్ పాల్గొన్నారు.

నేడు ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలు





ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ సుమారావు, సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి విద్యార్థులు

ప్రశాంతి నిలయం: దసరా వేడుకలు గురువారం ప్రశాంతి నిలయంలో ఘనంగా జరగనున్నాయి. పండుగ నేపథ్యంలో సాయికుల్వంత్ సభా మందిరాన్ని, సత్యసాయి మహాసమాధిని అలంకరించారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం గురువారం పూర్ణాహుతితో ముగియనుంది. ఆరు రోజులుగా జరుగుతున్న యజ్ఞంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాయికథ..

సత్యసాయి జీవిత చరిత్రను గాన రూపంలో వివరిస్తూ విద్యార్థులు నిర్వహించిన 'మధురం మధురం సాయి కథ' సంగీత కచేరీ భక్తులను మైమరపింపజేసింది. బుధవారం సాయంత్రం ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల అనంతపురం క్యాంపస్ ఉపన్యాసకురాలు ప్రొఫెసర్ సుమారావు సత్యసాయి ప్రేమ తత్వాన్ని వివరిస్తూ ప్రసంగించారు. వేయి తల్లుల ప్రేమను ఒక్క సత్యసాయి భక్త కోటికి పంచారని వివరించారు. అనంతరం సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు 'మధురం మధురం సాయి కథ' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు.

నేరాల కట్టడికి సమన్వయంతో పనిచేయాలి

- సిబ్బందికి ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశం
- హిందూపురం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ తనిఖీ



క్రైం రికార్డులు పరిశీలిస్తూ వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

హిందూపురం: నేరాల కట్టడికి పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన హిందూపురం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. ఇటీవల కాలంలో నమోదైన కేసులు..దర్యాప్తు గురించి ఆరా తీశారు. నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల గురించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రోజు రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేసి చోరీలు, అక్రమ రవాణా, డ్రంగ్ అండ్ డ్రైవ్‌ను నియంత్రించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, మహిళలు, చిన్నారులు, ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డయల్ 112కు వచ్చేకాల్స్‌కు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు తగిన సాయం అందించాలని ఆదేశించారు. ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా అవగాహన పెంచుతూ చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, కరీం, జనార్దన్, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ల ఘటనపై ఎస్పీ ఆరా

పెనుకొండ: ట్రావెలింగ్ ఏజెన్సీ కోసం మండలంలోని రెస్టారెంట్‌ల వద్ద కూటమి నాయకులు చేసిన దౌర్జన్యంపై ఎస్పీ సతీష్‌కుమార్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. మంత్రి సవిత అనుచరులుగా భావిస్తున్న కొందరు నాయకులు వెంకటరెడ్డిపల్లి వద్ద 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ రెస్టారెంట్‌తో పాటు చంద్రగిరి సమీపంలోని 'ముజిగి' అనే కొరియన్ హోటల్ వద్ద ట్రావెలింగ్ ఏజెన్సీ తమకే ఇవ్వాలని దౌర్జన్యానికి దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రెస్టారెంట్ సిబ్బందితో వాగ్వాదానికి దిగడమేకాక దాడికి సైతం ప్రయత్నించారు. ఈ తతంగమంతా రెస్టారెంట్ వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. స్థానిక పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్పీ సతీష్ కుమార్... హోటల్ నిర్వాహకులతో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు ఎస్పీతో తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలుస్తోంది. 4, 5 నెలలుగా కూటమి నాయకులు రెస్టారెంట్ వద్దకు వచ్చి గొడవకు దిగుతున్నారని వాపోయినట్లు తెలిసింది. దసరా అనంతరం ఈ ఘటనపై తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపినట్లు సమాచారం.

అందని పశు వైద్యం



చికిత్స కోసం ఆవును తోలుకొస్తే వైద్యులు లేరంటూ వాపోతున్న రైతు నాగభూషణ

పుట్టపర్తి టౌన్: స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో చికిత్స కోసం పాడి ఆవును తీసుకొచ్చిన రైతు ఇబ్బంది పడ్డాడు. పశువైద్యశాలలో ఏడీ సుధానిధి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఈశ్వర్‌నాయక్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడీ సుధానిధి ఇటీవలే బదిలీపై ఇక్కడకు వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ వస్తున్నారు. అయితే బుధవారం ఏడీ, ఎల్ఎస్ఓ ఇద్దరూ ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరయ్యారు. అదే సమయంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి పశువులను చికిత్స కోసం తొలుకొచ్చిన రైతులు ఉదయం 8 నుంచి 11గంటల వరకూ పడిగాపులు కాశారు. చివరకు సిబ్బంది అందించిన నామమాత్రపు వైద్యంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అధికారం మాటున అక్రమ రవాణా సాగిస్తోంది. అయినా మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల కళ్లెదుటే పెద్దసంఖ్యలో వాహనాల్లో మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలూ ఉన్నాయి.

- కరిగిపోతున్న కొత్తచెరువు మసీదు గుట్ట
- కొందరు టీడీపీ నేతల కనుసన్నల్లోనే అక్రమ రవాణా
- అనుమతులు లేకుండా తవ్వకాలు



మసీదు గుట్టలో మట్టిని తవ్వి టిప్పర్‌కు లోడ్ చేస్తున్న హిటాచీ

కొత్తచెరువు: అధికార పార్టీకి చెందిన కొందరు కీలక నాయకులు కొత్తచెరువులో మట్టిదందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తచెరువులోని మసీదు గుట్టను కొల్లగొడుతున్నారు. రోజూ 50 నుంచి 100 టిప్పర్లపైనే మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.4వేల చొప్పున విక్రయిస్తుండగా రోజుకు రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకూ అక్రమంగా సంపాదిస్తున్నట్లు సమాచారం. అయినా ఏ పోలీసు అధికారి కానీ, మైనింగ్ అధికారులు కానీ కన్నెత్తి చూడడంలేదు. బడా రాజకీయ నేతల కనుసన్నల్లోనే మట్టి దందా జరుగుతుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. చుట్టుపక్కల ఎక్కడ వెంచర్లు వేసినా, ఎక్కడ భూమి చదను చేయాలన్నా అధికార పార్టీకి చెందిన నాయకులు మాత్రమే మట్టి రవాణా చేస్తుండడం గమనార్హం.

రాత్రి సమయంలోనే అక్రమ రవాణా..

కొత్తచెరువులోని నాగిరెడ్డిపల్లి రోడ్డు సమీపంలో దాదాపు ఆరు ఎకరాల్లో మసీదు గుట్ట విస్తరించి ఉంది. ఈ గుట్టకు అనుకుని ఉన్న స్థానిక టీడీపీ నేత పట్టా భూమిని అడ్డుగా పెట్టి అక్రమ దందాకు తెర లేపినట్లు ఆరోపణలున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నేతలే మట్టి దందాను కొనసాగిస్తుండడంతో ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు స్థానికులు సైతం భయపడుతున్నారు. దీంతో మాఫియా మరింత రెచ్చిపోతోంది. సహజ వనరులను కరిగించేస్తోంది. గడిచిన వారం రోజులుగా గుట్టను పెకలించడంతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్ట కాస్త నాలుగు ఎకరాలకు పరిమితమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మసీదు గుట్ట కాస్త మాయం అవడం ఖాయమని స్థానికులు అంటున్నారు.

చర్యలు తప్పవు

గత సోమవారం అందిన సమాచారం మేరకు రాత్రి తనిఖీ చేపట్టి మట్టి తవ్వకాలను అడ్డుకున్నాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, తరలింపులు చేపట్టరాదు. సొంత పట్టా భూమిలో మట్టి తవ్వాలన్నా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించే ఎంతటివారినైనా ఉపేక్షించబోం. మసీదు గుట్టలో సాగుతున్న అక్రమ తవ్వకాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– బాలాంజనేయులు, తహసీల్దార్, కొత్తచెరువు

కొత్త టీచర్లకు రేపటి నుంచి శిక్షణ



సమీక్షలో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

హిందూపురం టౌన్: డీఎస్సీ–25 ద్వారా కొత్తగా ఎంపికైన జిల్లాలోని టీచర్లకు రేపటి (శుక్రవారం) నుంచి ఈనెల 10 వరకు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం హిందూపురంలోని బీఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాన్ని బుధవారం డీఈఓ కృష్ణప్ప పరిశీలించారు. ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి విషయంలో ఏమాత్రం లోటుపాట్లు ఉండకూడదన్నారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకూ ఇండక్షన్ ట్రైనింగ్ కొనసాగుతుందన్నారు. నూతన ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు మెరుగు పడేలా శిక్షణ కొనసాగాలని శిక్షకులకు సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ మాలిక్, ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి, సీఆర్ఎంటీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్‌లు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన



తనకల్లు: కనసానిపల్లి గ్రామస్తులు తాగునీటి సమస్యపై బుధవారం తనకల్లు పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. రెండు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ట్యాంక్‌ను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో లోపల చెత్తాచెదారం పేరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ట్యాంక్‌కు అమర్చిన పైపులు మూసుకుపోవడంతో నీరు బయటకు రావడం లేదని తెలిపారు. ట్యాంక్‌ను శుభ్రం చేసి కుళాయిలకు సురక్షిత నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రమణారెడ్డి, ఎర్రంరెడ్డి, అనిత, లక్ష్మీదేవి, జయమ్మ, రాములమ్మ, శకుంతల, అనసూయమ్మ, రాములమ్మ, మల్లమ్మ, చౌడమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలుడిని అక్కున చేర్చుకున్న ఖాకీ

కొత్తచెరువు: అనాథ బాలుడిని అక్కున చేర్చుకుని స్థానిక పీఎస్ సీఐ జి.మారుతీశంకర్ మానవత్వాన్ని చాటారు. వివరాలు... గస్తీలో భాగంగా మంగళవారం రాత్రి కొత్తచెరువులోని నెహ్రూ సర్కిల్ వద్దకు చేరుకున్న సీఐ మారుతీశంకర్ అక్కడ ఒంటరిగా తచ్చాడుతున్న 12 ఏళ్ల బాలుడిని గుర్తించి, దగ్గరకు పిలుచుకుని ఆరా తీశారు. కొత్తచెరువు మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన అంజి కుమారుడు ఎనుముల రాజశేఖర్‌గా గుర్తించారు. తల్లిదండ్రులిద్దరూ మృతిచెందడంతో అనాథగా రోడ్లపై తిరుగుతున్నట్లుగా బాలుడు పేర్కొనడంతో సీఐ మారుతీశంకర్ చలించిపోయారు. అలాగే రోడ్డుపై వదిలేస్తే వ్యసనాలకు బానిసవుతాడని భావించిన ఆయన.. వెంటనే తన వాహనంలో బాలుడిని ఎక్కించుకుని పీఎస్‌కు చేర్చారు. బుధవారం ఉదయం బార్బర్‌ను పిలిపించి శుభ్రంగా కటింగ్ చేయించారు. నూతన దుస్తులను ఇప్పించారు. అనంతపురంలోని చైల్డ్‌వెల్ఫేర్ కార్యాలయాన్ని సంప్రదించి, వారి ద్వారా కడపలోని అనాథ శరణాలయంలో ఆశ్రయం, చదువులు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. సకాలంలో బాలుడి భవిష్యత్తు అంధకారం కాకుండా కాపాడిన సీఐ మారుతీశంకర్ చొరవను స్థానికులు తెలుసుకుని అభినందించారు.



బాలుడి బాగోగులపై సిబ్బందితో చర్చిస్తున్న సీఐ మారుతీశంకర్

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

- బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్‌పాషా
- అనంత వేదికగా అట్టహాసంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న జీఎం ముజీబ్‌పాషా

అనంతపురం సిటీ: వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ ముందుకు సాగుతోందని ఆ సంస్థ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ (జీఎం) షేక్ ముజీబ్‌పాషా పేర్కొన్నారు. అనంతపురంలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మారిన కాలానుగునంగా ప్రైవేటు సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ లోనూ అనేక సంస్కరణలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగదారులకు మెరుగైన, వేగవంతమైన సేవలందించడమే లక్ష్యంగా దూసుకుపోతోందని వివరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్లు 13,208 ఉండగా, ఓఎల్‌టీఎస్ 189 కనెక్షన్లు ఉన్నాయన్నారు. 2జీ/4జీ టవర్లు 343 ఉండగా, 2,79,591 మంది ప్రీపెయిడ్ వినియోగదారులు ఉన్నారన్నారు. 2,679 మంది పోస్ట్‌పెయిడ్ కస్టమర్లు, 790 ఐఎల్ఎల్ కనెక్షన్లను కలిగి ఉన్నామన్నారు. సమష్టి కృషితోనే తమ సంస్థ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, వచ్చే ఏడాదిలో 5జీ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండే ధరలు, స్కీముల అమలు కారణంగా ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌లోకి పోర్ట్ అయ్యే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీజీఎం బాలగంగాధర్‌రెడ్డి, ఏజీఎం బాలాజీ, ఎస్‌డీఈలు రేవతి, హేమంత్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, జేటీఓలు మాళవిక తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ల అరెస్ట్

ఓడీచెరువు: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును అపహరించిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ఓడీ చెరువు మండలం చౌడేపల్లిలో గత నెల 28న రాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు లక్ష్మమ్మ మెడలోని 18 గ్రాముల బరువున్న బంగారు గొలుసును ఇద్దరు దుండగులు లాక్కొన్నారు. ఆ సమయంలో వృద్ధురాలు కేకలు వేయబోగా బెదిరించి ఉడాయించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో అదే గ్రామానికి చెందిన బి.సిద్దారెడ్డి, ఎం.రాజశేఖర్‌ను బుధవారం మధ్యాహ్నం ఎంబీ క్రాస్ సమీపంలో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో నేరాన్ని వారు అంగీకరించారు. వారి నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఐచర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- నలుగురికి గాయాలు

కనగానపల్లి: మండలంలోని పర్వతదేవరపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఐచర్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు... బెంగుళూరు నుంచి ఆదోని వైపు బుధవారం వెళ్తున్న ఆర్టీసీ బస్సు పర్వతదేవరపల్లి సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారి పక్కనే ఆపి ఉన్న ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ప్రయాణికులు గౌస్, వంశీ, పరుశురామ్, పురుషోత్తం గాయపడ్డారు. వీరిని వెంటనే అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, వీరిలో రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడిన గౌస్‌ను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడిపై దాడి

తనకల్లు: మండలంలోని కొట్టువారిపల్లికి చెందిన రాజశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన స్టోర్ డీలర్ భర్త లక్ష్మీనారాయణ, ఆయన కుటుంబసభ్యులు బుధవారం దాడి చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... గ్రామంలో బుధవారం డీలర్ భర్త లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. లబ్ధిదారులందరూ ఒకే చోటుకు వస్తేనే స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడంతో రాజశేఖర్ అభ్యంతరం తెలిపాడు. నిబంధన మేరకు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని కోరాడు. దీంతో డీలర్ భర్త, కుటుంబసభ్యులు రాజశేఖర్‌పై దాడి చేయడంతో కుడి మోకాలికి బలమైన గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

వృద్ధుల ఆవశ్యకతను గుర్తించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: కుటుంబం అభ్యున్నతిలో వృద్ధుల సహకారం ఎనలేనిదని, వారి ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం అన్నారు. అక్టోబర్ 1న జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం 'సొసైటీ ఫర్ ఆల్ ఏజెస్' పోస్టర్లను ఆమె విడుదల చేసి, మాట్లాడారు. మలి వయసులో ఉన్న వారికి చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్యం, జీవిత కాలభాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో ఈ నెల 31 వరకూ వృద్ధులకు తగిన గౌరవం ఇస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేబిస్ నివారణ సాధ్యమే..

సరైన చికిత్స అందిస్తే కుక్కల ద్వారా మనుషులకు వ్యాపించే రేబిస్ వ్యాధిని వంద శాతం నివారించవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజబేగం పేర్కొన్నారు. బుధవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద యాంటీ రేబిస్ పోస్టర్లను ఆమె విడుదల చేసి, మాట్లాడారు. ఈ ఏడాది రేబిస్‌ను నివారిద్దాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రేబిస్ నివారణకు కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, పీఓ డాక్టర్ సునీల్, డెమో బాబా ఫక్రుద్దీన్, ఎపిడమాలజిస్ట్ బాలాజీ నాయక్, ఆఫీస్ సూపరెండెంట్ ఫైరోజ్, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B. PHARMACY అడ్మిషన్స్

■ AP EAPCETలో క్వాలిఫైడ్ Bi.PC స్టూడెంట్స్‌కి B.Pharmacy నందు గవర్నమెంట్ సీట్స్‌లో జాయిన్ కావడానికి అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్, ఫ్రీ హాస్టల్ కలదు. Cont: G.MURALI, 9030661651, అనంతపురం. [A-7193]

అడ్మిషన్స్

■ B.Sc (MLT), B.P.T (ఫిజియోథెరపీ) కోర్స్‌కి గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్, ఫ్రీ హాస్టల్ కలదు. అర్హత: ఇంటర్మీడియట్‌లో Bi.P.C పాస్ (లేదా) Any ఒకేషనల్ గ్రూప్‌తో పాటు బ్రిడ్జి కోర్స్ పాస్ కావలెను. Contact: G.MURALI, 9030661651, అనంతపురము. [A-1694]

DISTANCE EDUCATION

■ దూర విద్య ద్వారా ఒకే సం॥లో 10, ఇంటర్, డిగ్రీ, PG అన్ని గ్రూపులు EM/TM. 14 సం. పైబడినవారు SSCకి అర్హులు. లాస్ట్ డేట్ అక్టోబర్ 10, # సాయి ఇనిస్టిట్యూషన్, 14/402, కమలా నగర్, ATP. 9059723829. [SCA25008515]

DMLT ADMISSIONS

■ DMLT 2 సం॥ కోర్సుకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. లాస్ట్ డేట్:04-10-2025. # SEEDS కాలేజ్, కమలానగర్, అనంతపురం. సెల్: 9100494926, 9440255034. [SCA25008592]

EDUCATION

■ Join B.Sc Ai / CSc over 60%, Maths in 10+2 get 5000 fee discount Join M.Com/ MA Eng/MSW by 6/10, 3000 fee dis, 9177408565 [SCA25008618]

REAL ESTATE

LAND FOR SALE

■ FOR SALE - 25 Acres Agricultural Land At Nidhanawada Village, Singanamala Mandal, Anantapur. 15 Acres with Apple Bare Plantation Facing 60 ft wide road. Serious buyers only. Cont: 7993459555, 9908912349. [A-1695]

PLOTS FOR SALE

■ ATP బైపాస్-హార్మోన్ సిటీ అనుకొని, రెసిడెన్షియల్ ప్లాట్లు మరియు సాక్షి ప్రెస్ బ్యాక్ సైడ్ రోడ్డుకి, కమర్షియల్ సైట్ 21 సెంట్లు FOR SALE. వాట్సాప్ కాల్ మాత్రమే. +9163007 72262. [SCA25008381]

WANTED

■ S.V బిజినెస్ షాపు (అనంతపురం) నందు పనిచేయుటకు 10th / Inter చదివిన (Male) వర్కర్ కావలెను. సంప్రదించండి సెల్: 8074429294, 9542093517. [A-1074]

■ ప్రముఖ ప్రైవేట్ కంపెనీలో పనిచేయడానికి మార్కెటింగ్ లో అనుభవం ఉండినా MBA పూర్తి చేసిన వ్యక్తి కావలెను సెల్ : 9848524061 [SCA25008550]

■ ATP, ఓల్డ్ టౌన్, వాటర్ బాటిల్స్ డెలివరీ చేయుటకు బాయ్స్ కావలెను. 3 వీలర్ డ్రైవింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యత. జీతం: ₹ 13,000. సంప్ర॥ సెల్ : 99490 41389. [SCA25008596]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వం దిగిరాకపోతే ఆమరణ దీక్షలు



సమ్మెలో పాల్గొన్న జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు



చంటి బిడ్డతో సమ్మెలో పాల్గొన్న డాక్టర్ షిఫా సుల్తానా

- స్పష్టం చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు
- రెండోరోజూ కొనసాగిన రిలేనిరాహార దీక్షలు

పుట్టపర్తి అర్బన్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసనలు, ధర్నాలు చేసినా స్పందించని ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఇప్పటికే సమ్మె బాట పట్టిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు ఆమరణదీక్షలకు సిద్ధమయ్యారు. హక్కుల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద వైద్యులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. వైద్యులకు ఏపీ ల్యాబ్ టెక్నీషియన్ అసోషియేషన్ అధ్యక్షుడు జనార్దన్, జనరల్ సెక్రెటరీ మస్తాన్ వలి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఏపీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కార్తిక్, ట్రెజరర్ జయతేజ నాయక్, ఈసీ మెంబర్ విజయ్‌భాస్కర్ తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం పలువురు వైద్యులు మాట్లాడుతూ...ప్రభుత్వంతో జరుపుతున్న చర్చలు విఫలమైతే ఈనెల 3వ తేదీ నుంచి విజయవాడ వేదికగా ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న ఇన్‌సర్వీస్ ఫీజు చాలా తక్కువ అన్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న వైద్యులకు సైతం ప్రమోషన్ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీసం మరుగుదొడ్లు కూడా లేని చోట పగలంతా పని చేస్తున్నామన్నారు. తాము టైం బాండ్ ప్రమోషన్లు, చంద్రన్న సంచార చికిత్సలో రూ.5 వేలు భత్యం, ఇన్ సరీ్వస్ పీజీ కోటా, నోషనల్ ఇంక్రిమెంట్లు, 50 శాతం మూల వేతనం, పని గంటలు, జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి కష్ట పడ్డామని, తమ కష్టాన్ని అర్థం చేసుకుని తమ హక్కులను, ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కాగా బుధవారం నాటి సమ్మెలో డాక్టర్ షిఫా సుల్తానా తన పసిపాపతో పాల్గొనడం విశేషం.

టైంబౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలి



గతంలో పీఆర్‌సీలో ఇచ్చిన టైంబౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలి. 18 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేశాను. సీనియారిటీని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికీ ప్రమోషన్ ఇవ్వాలి. రెండు, మూడేళ్ల కింద వచ్చిన ఇతర వైద్యులకు ప్రమోషన్లు ఇచ్చి మాకు అన్యాయం చేయడం తగదు.

– కేసీ కుళ్లాయప్ప నాయక్, పీపీ యూనిట్ వైద్యుడు

అలవెన్సులు ఇవ్వాలి



గతంలో క్లినికల్‌కు 20 శాతం, నాన్ క్లినికల్‌కు 50 శాతం ఇన్‌సర్వీస్ ఫీజు ఇస్తామన్నారు. ఇప్పుడు 15 శాతానికి తగ్గించారు. పొరుగు రాష్ట్రాల్లో ఇన్‌సర్వీసు ఫీజు 50 శాతానికిపైగా ఉంది. సంచార చికిత్సకు వెళ్లే వైద్యులకు రూ.5 వేల భత్యం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే 3 ఏళ్లుగా ఇవ్వడం లేదు.

– రాజేంద్ర, ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు

స్టాఫ్ నర్సులను భర్తీ చేయాలి



మహిళా డాక్టర్లు సంచార వైద్య చికిత్సలకు వెళ్తే అక్కడ కనీసం మరుగుదొడ్డి సదుపాయం కూడా ఉండదు. అలాంటి చోట పని చేశాం. వారాంతపు సెలవులు, కచ్చితమైన పని గంటలు కేటాయించాలి. స్టాఫ్ నర్సుల ఖాళీలను భర్తీ చేస్తే... పీహెచ్‌సీలో పని చేసే డాక్టర్లకు వెసులుబాటు ఉంటుంది.

– డాక్టర్ సరిత